సాక్షి
బాపట్ల
శుక్రవారం । 20 । జూన్ । 2025



స్టాక్ పాయింట్ తనిఖీ

కొల్లిపర: జెడ్పీ హైస్కూలులో స్టాక్ పాయింట్‌ను రాష్ట్రీయ మాధ్యమిక సర్వ శిక్ష అభియాన్ డైరెక్ట ర్ పి.పార్వతి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థి మిత్ర కిట్స్‌ను విద్యార్థులకు అందేలా చూడాలన్నారు.



ఈవీఎం గోడౌన్ తనిఖీ

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్‌లు భద్రపరి చిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం తనిఖీ చేశారు.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు

రెంటచింతల: పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిరిడీసాయి దేవస్థానంలో షిరిడీ సాయికి దేవస్థానం ప్రధాన అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

23న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ



రేపల్లె: అంగన్‌వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగి అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న బాపట్ల కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ తెలిపారు. గురువారం రేపల్లె సీడీపీవో సుచిత్రకు అంగన్‌వాడీల తరుపున ఆమె సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. చాలీ చాలని వేతనాలతో బాధ్యతలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ పథకాల నుంచి దూరం చేయటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నాయన్నారు. కేవలం జీతభత్యాల చెల్లింపుల్లో కార్మికులుగా చూస్తూ అరకొర జీతాలతో సరిపెడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయని పక్షంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలన్నారు. 23న జరిగే ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కే.రత్నకుమారి, నాయకులు ఎస్.కృష్ణకుమారి, పి.నిర్మల, బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


పీజీ లాసెట్‌లో చిరువ్యాపారి కుమార్తెకు స్టేట్ మొదటి ర్యాంకు



హరితశ్రీ

అద్దంకి: చిరు వ్యాపారి కుమార్తె ఏపీ పీజీ లాసెట్‌లో స్టేట్ మొదటి ర్యాంకు సాధించింది. బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలో నివాసం ఉంటున్న బైసాని శ్రీనివాసరావు చిరువ్యాపారి, ఆమె తల్లి సుజాత ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. వీరి కుమార్తె హరితశ్రీ చిన్న వయసు నుంచి చదువులో ప్రతిభ చూపుతూ వస్తోంది. పదో తరగతి వరకు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాన్‌లోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో చదివింది. తొలుత లా సెట్ రాసి ర్యాంకు సాధించి ఎల్ఎల్‌బీ చదివింది. అనంతరం పీజీ సెట్ రాసి ఏకంగా స్టేట్ మొదటి ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందింది. హరితశ్రీ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని తనకు పీజీ లా సెట్‌లో ర్యాంకు రావడానికి సహకారం అందించిన తన తల్లిదండ్రులతోపాటు, సిద్ధార్థ కళాశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపింది.

చీరాల విద్యార్థికి 20వ ర్యాంకు



దేవి వరప్రసాద్

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్ పీజీ లాసెట్ ఫలితాల్లో చీరాల విద్యార్థి అన్నపురెడ్డి దేవి వరప్రసాద్ రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు సాధించాడు. బాపట్ల జిల్లా చీరాల రామకృష్ణాపురానికి చెందిన దేవి వరప్రసాద్ ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో తృతీయ సంవత్సరం ఎల్ఎల్‌బీ పూర్తి చేశాడు. ప్రస్తుతం గురువారం ప్రభుత్వం విడుదల చేసిన లాసెట్ పోస్టుగ్రాడ్యుయేషన్ (పీజీ) పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు సాధించాడు. దేవి వరప్రసాద్ తల్లి చీరాల కోర్టులో న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. తల్లిదండ్రులైన కల్పన, వెంకట శివ అందించిన ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించినట్లు తెలిపాడు. భవిష్యత్తులో తాను న్యాయమూర్తి కావాలనేది లక్ష్యమని తెలిపాడు. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన దేవి వరప్రసాద్‌ను తల్లిదండ్రులతోపాటు సహచర మిత్రులు అభినందించారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

యద్దనపూడి: ప్రమాదవశాత్తు బాలుడు(4) నీటికుంటలో పడి మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోలూరు ఎస్సీ కాలనీలోని ఓ కుటుంబానికి చెందిన బాలుడు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నాడు. మధ్యాహ్నం కేంద్రానికి పక్కనే ఉన్న ఇంటికి వెళ్లాడు. ప్రతి రోజూ తమ బంధువుల ఇంటి వద్ద ఆడుకొని ఇంటికి వచ్చే బాబు సాయంత్రం 3 గంటలైనా ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో ఇంటి సమీపంలోనే ఉన్న చెరువు వద్ద ఆర్వో ప్లాంటు కోసం తీసిన గోతిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. ఈ విషయమై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై రత్నకుమారి తెలిపారు.

నీకింత..నాకింత

- తీరం భూములను కబ్జా చేస్తున్న కూటమి నేతలు
- ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్చిన వైనం
- కొన్నింటికి డీకేటీలు పుట్టించి అమ్మకాలు
- బాపట్ల, చినగంజాం, నిజాంపట్నం ప్రాంతాల్లో రొయ్యల చెరువులు
- చీరాల వేటపాలెం మండలాల్లో వెంచర్లు, రిసార్ట్‌ల నిర్మాణాలు
- అక్రమాల పేరుతో వేటపాలెం తహసీల్దార్‌ను సరెండర్ చేసిన కలెక్టర్
- చినగంజాం, బాపట్ల మండలాల్లో అధికారుల జోలికి వెళ్లని వైనం
- కూటమి అధికారంలోకి రాగానే పచ్చనేతల కబ్జా పర్వం

వాటాలు పంచుకుంటున్న రెవెన్యూ అధికారులు, పచ్చనేతలు

కూటమి అధికారంలోకి రాగానే పచ్చనేతలు బరితెగించారు. కబ్జాలకు పాల్పడుతున్నారు. వారికి వెన్నుదన్నుగా కొందరు అధికారులు నిలుస్తున్నారు. బాపట్ల, చీరాల, వేటపాలెం ప్రాంతాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించిన పచ్చనేతలు కొందరు రొయ్యల చెరువులు సాగుచేస్తుంటే మరికొందరు వెంచర్లు వేసి స్థలాలు అమ్మేస్తున్నారు. ఇంకొందరు తీరంలో రిసార్ట్స్ నిర్మించి వ్యాపారానికి తెరతీశారు. కొంతమంది కబ్జా భూములకు డీకేటీలు సృష్టించి విక్రయించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం మాని ఉన్నతాధికారులు అక్రమార్జనలో వాటాల కోసం వెంపర్లాడుతున్నారు.



బాపట్ల మండలం అడవి పంచాయతీలో సముద్రం అలల వరకూ పచ్చ నేత ఆక్రమించిన భూమి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: తాజాగా బాపట్ల, వేటపాలెం, చీరాల మండలాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పచ్చనేతలతో కలసి కబ్జా చేసినట్లు తెలుస్తోంది. బాపట్ల మండలం అడవి పంచాయతీలోని పాండురంగాపురం ప్రాంతంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించిన కొందరు టీడీపీ నేతలు వాటిల్లో అక్రమంగా రొయ్యల చెరువులు సాగుచేస్తున్నారు. ఆక్రమిత భూముల్లో కొన్నింటికి డీకేటీ పట్టాలు పుట్టించారు. ఒక పచ్చనేత ఆక్రమణలోని 40 ఎకరాలకు డీకేటీలు పుట్టించి కొన్నింటిని ఎకరం రూ.4 కోట్లకు అమ్మగా మిగిలిన భూమిని రొయ్యల సాగుకు వినియోగిస్తున్నారు. ఇదే ప్రాంతంలో చీరాలకు చెందిన మరో టీడీపీ నేత 30 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని కొంతకాలం రొయ్యల చెరువులు సాగుచేసి ఆక్రమిత ప్రభుత్వ భూమిలో సుమారు పది ఎకరాల భూములకు డీకేటీలు పుట్టించి అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. ఆక్రమిత భూములన్నింటిని సదరు పచ్చనేత గుంటూరు ప్రాంతానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోంది. వారు కొన్న భూమితోపాటు సముద్ర తీరం వరకూ ఉన్న మరికొంత ప్రభుత్వ భూమిని ఇటీవల కబ్జా చేశారు. దీంతో తీరప్రాంతంలోని మత్స్యకారులు ఆక్రమణలకు అడ్డుతగిలారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఇద్దరు నేతలు బాపట్ల రెవెన్యూ అధికారులకు కోట్లలోనే ముడుపులు ముట్టజెప్పినట్లు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఏకంగా సముద్రతీరం వరకూ ఆక్రమించినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

చీరాలలో భారీగా కబ్జాలు

వేటపాలెం మండలంలోని తీర ప్రాంతంలో రిసార్ట్స్ నిర్మాణం అధికంగా ఉండడంతో ఇక్కడ పచ్చ కబ్జాలకు అడ్డుఅదుపూ లేకుండా పోయింది. ఇటీవల చీరాల పచ్చనేత 11 ఎకరాలు కబ్జా చేసినట్లు నియోజకవర్గం మొత్తం చర్చ జరుగుతుంది. ఎకరం రూ.5 కోట్లు విలువచేసే ఈ భూమితోపాటు మరో రెండు చోట్ల దాదాపు 22 ఎకరాలు ఆక్రమించినట్లు సమాచారం. వేటపాలెం రెవెన్యూ అధికారి అండతోనే ఈ మొత్తం వ్యవహారం నడిచినట్లు ప్రచారంలో వుంది. ఇదే నియోజకవర్గానికి చెందిన మాజీ శాసనసభ్యుడికి సైతం సదరు రెవెన్యూ అధికారి వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో వందలాది ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూములు కట్టబెట్టినట్లు ప్రచారం వుంది. దీంతో ఇటీవల వేటపాలెం తహసీల్దారును జిల్లా కలెక్టర్ వెంకట మురళి సరెండర్ చేశారు. అక్రమాల వ్యవహారాలతోపాటు విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారనే కారణంతో తహసీల్దారుపై చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది.

కక్షతోనే సరెండర్

రెవెన్యూ ఉన్నతాధికారులకు తీరప్రాంతంలో ప్రభుత్వ భూములు అప్పగించలేదన్న కక్షతోనే తనను సరెండర్ చేశారని, ఇప్పటికే ఉన్నతాధికారులు వేటపాలెం తీరప్రాంతంలో పెద్ద మొత్తంలో భూములు కబ్జాచేశారని, త్వరలోనే ఆ వివరాలు మీడియాకు వెల్లడిస్తానని సరెండర్ అయిన తహసీల్దార్ చెబుతున్నారు. కిందిస్థాయి రెవెన్యూ అధికారులు కొందరు దీనిని ధ్రువీకరిస్తున్నారు. ఆ వివరాలు బయటపడితే రెవెన్యూ ఉన్నతాధికారులు ఏ స్థాయిలో భూములు కబ్జా చేశారన్న విషయం వెల్లడి కానుంది. విలువైన ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూములను కాపాడాల్సిన అధికారులు పచ్చనేతలతో కలిసి వాటాలు పంచుకోవడం, కబ్జాలకు దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జా ఆరోపణలున్న పచ్చనేతలు, అధికారులపై విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశముంది.



రామాపురంలో తీరం వరకూ భూమిని చదును చేసిన రిసార్ట్‌ల యజమానులు



వేటపాలెం మండలంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా రొయ్యల చెరువుల సాగు

యోగాతో ఆరోగ్యానికి రక్ష

కలెక్టర్ వెంకట మురళి



చీరాల టౌన్: ప్రతిరోజూ యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం, ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. గురువారం మండలంలోని వాడరేవులోని నగరవనంలో (సిటీ ఫారెస్ట్) యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఆర్డీఓ టి.చంద్రశేఖర నాయుడు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ప్రపంచమంతా జరుపుకుంటుందన్నారు. బాపట్ల జిల్లాలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 21న ఏపీలోని అన్ని జిల్లాలు, మండలాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వికసిత్ భారత్ వైపు దేశం, ఆంధ్రప్రదేశ్ పయనిస్తుందన్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ యోగా చేయడం వలన చాలా మంచి ఫలితాలు ఉన్నాయని, యోగాను ప్రజలందరికీ అలవాటు చేసేందుకు సీఎం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు తొలగి ప్రజలు ప్రశాంతంగా ఉండటానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎం అండ్ హెచ్‌వో విజయమ్మ, ఆయుష్ డాక్టర్ శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు, సిబ్బంది, పలువురు వైద్యులు, ఎస్‌సీపీ క్యాడెట్లు, ప్రజలు పాల్గొన్నారు.

చీరాలలో ఆగని ఇసుక దందా

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు



బోయినవారిపాలెం ఇసుక దిబ్బలను కరిగించి వేస్తున్న అక్రమార్కులు

చీరాల టౌన్: ప్రకృతి సంపద అయిన ఇసుకను అప్పనంగా ఆరగిస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారు కూటమి నేతలు. 24 గంటలు ట్రాక్టర్లు, ట్రక్కులు, లారీలు, టైరు బండ్లలో ఇసుకను రవాణా చేస్తున్నా పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మైనింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ''ఇసుక ఎవరూ రవాణా చేయకూడదు.. మేము నిరంతరం నిఘా పెట్టాం.. అక్రమార్కులు ఎవరైనా వదలి పెట్టం'' అంటూ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి నిత్యం హెచ్చరిస్తుంటారు. కానీ చీరాల నియోజకవర్గంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. చీరాల మండలంలోని సముద్ర తీర ప్రాంతంతోపాటు ఈపూరుపాలెం, విజయనగర్‌కాలనీ, సావరపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, పాతచీరాల, 216 జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ఇసుక దిబ్బలను పొక్లెయిన్లతో తవ్వకో వడంతో ఆ స్థలాలు చెరువుల్లా మారాయి. ఈపురుపాలెంలో కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమాలు సాగుతున్నాయి. బోయినవారిపాలెం రోడ్డులో, 216 జాతీయ రహదారి సమీపంలో, సైఫన్ కాలువ సమీపంలో ఇసుక తరలించే లారీలు, రోడ్డు పక్కన తరలించేందుకు సిద్ధం చేసుకున్న ఇసుక డంపింగ్‌లు దర్శనమిస్తుంటాయి.

టైరుబండి రూ.2000..ట్రాక్టర్ రూ.3,500

గతంలో అర్ధరాత్రి టైరుబండితో ఇసుకను తరలించే అక్రమార్కులు నేడు రోజంతా టైరు బండ్లు, ట్రాక్టర్లతో ఇసుక సరఫరా చేస్తున్నారు. టైరు బండికి రూ.2 వేలు, ట్రాక్టర్ రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. రోజుకు వంద వరకు ట్రాక్టర్లు, టైరు బండ్లు, ట్రక్కుల ద్వారా ప్రకృతి విధ్వంసం జరుగుతోంది. చీరాల మండలంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈపురుపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, పాతచీరాల, గవినివారిపాలెంతోపాటు వేటపాలెంలో ఆరితేరిన ముగ్గురు నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా జరుగుతోంది. చీరాల పోలీసు రూరల్ సర్కిల్ పరిధిలోని రూరల్ పోలీస్‌స్టేషన్, వేటపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



ఇసుకను అక్రమార్కులు తరలించడంతో చెరువులా మారిన ప్రదేశం

చర్యలు తప్పవు

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించం. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నాం. ఈపురుపాలెం, బోయినవారిపాలెం, పాతచీరాల, తీర ప్రాంత గ్రామాల్లో అక్రమంగా ఇసుక క్వారీలు నిర్వహించినా, అమ్మకాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

– కె.గోపికృష్ణ, తహసీల్దార్, చీరాల

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన అవసరం

సాంఘిక, గిరిజన సంక్షేమం శాఖ కార్యదర్శి మల్లికార్జుననాయక్



ర్యాలీ పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మంగళగిరి: సికిల్ సెల్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ సాంఘిక, గిరిజన సంక్షేమం శాఖ కార్యదర్శి ఎం.మల్లికార్జుననాయక్ తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో గురువారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, గిరిజన వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జుననాయక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. వారసత్వంగా వచ్చే రుగ్మతకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలో భాగంగా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సరస్వతి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న, బ్లడ్ సెల్ కన్సల్టెంట్ డాక్టర్ సోనియా మోహన్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు, ఎయిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీమంత్‌కుమార్ దాస్, ఎయిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరి

- ఆ ప్రకారమే రైతులు పంటలు వేసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- పర్చూరులో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



పర్చూరులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ మంత్రి

పర్చూరు(చినగంజాం): రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. పర్చూరులో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం పునఃప్రారంభించారు. పర్చూరు వచ్చిన ఆయనకు స్థానిక రైతులు స్వాగతం పలికారు. పర్చూరు వై.జంక్షన్ నుంచి ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొమ్మల సెంటర్‌లోని ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకొని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం పెట్టిన రూ.1650 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. ఈ ఏడాది మిర్చి, పొగాకు, కోకో, మామిడి పంటలకు గిట్టుబాటు ధర లేదని ఆయన అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో కోకో రూ. 50, కిలో మామిడి రూ. 4 వంతున అదనంగా రైతులకు చెల్లిస్తుందని వివరించారు. నల్లబర్లీ హై గ్రేడ్ పొగాకు కిలో రూ.12, లో గ్రేడ్ పొగాకు రూ.6 చొప్పున రైతులకు చెల్లిస్తుందని తెలిపారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించడం సంతోషకరమైన విషయంఅన్నారు. ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న చివరి పొగాకు వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. మార్క్‌ఫెడ్ సూచించిన నిబంధనల మేరకు నాణ్యమైన పొగాకుకు తీసుకొని వెళ్లి కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని సూచించారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ గతంలో పొగాకు పంటకు లాభాలు వచ్చాయని, ప్రస్తుతం డిమాండ్ లేక గిట్టుబాటు ధర పడిపోయిందని వివరించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు ఎప్పుడు రావాలో ఫోన్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించిందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. వచ్చే ఏడాది రైతులు ఎవరూ పొగాకును పండించవద్దని సూచించారు. పొగాకు నారు, విత్తనాలు కూడా అందుబాటులో లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలానీ సామూన్, గోడౌన్ ఎండీ సురేష్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకటరావు, కార్యదర్శి తిరుపతి రాయుడు,బాపట్ల ఆర్డీఓ గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,000** గరిష్ఠం : రూ. **1,500**

మోడల్ ధర రూ. **1,300**

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,600
అమ్మకాలు	43,494
నిల్వ	8,856

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,200
273	10,000-12,400
341	10,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,800-13,300
నంబరు-5	10,000-13,300
341	10,000-13,500
273	10,000-13,400

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,300
తాలుకాయలు	5,000-6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,200
బాడిగ-355	10,000 - 13,300
దేవనూరు డీలక్స్	10,000 - 13,500
తాలు	5,000 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **142**

కొమ్ములు : **90** బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
8,000	10,550	10,505

కాయలు : **52** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,430	10,550	10,505

మొత్తం అమ్మకాలు : **106.500** క్వింటాళ్లు

-దుగ్గిరాల

డంపింగ్ యార్డుగా శ్మశాన వాటిక

- సమాధులను ముంచెత్తుతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు



వాడరేవులో సమాధుల చుట్టూ నిండి ఉన్న చెత్త, వ్యర్థాలు

చీరాలటౌన్: అంత్యక్రియలకు ఉపయోగించే శ్మశానవాటికను డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. ఈ క్రమంలో సమాధులను చూడాలన్నా.. మృతి చెందిన వారికి దహన సంస్కారాలు చేయాలన్నా వాడరేవు గ్రామస్తులు అల్లాడుతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను శ్మశానవాటికలో వేస్తూ గ్రామస్తుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా చెత్తను తగలబెట్టడంతో వచ్చే పొగ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీతోపాటు తీర ప్రాంతంగా పేరొందుతున్న వాడరేవు గ్రామంలోని లైట్ హౌస్‌వద్ద ఉన్న శ్మశానవాటిక ప్రస్తుతం డంపింగ్ యార్డుగా మారింది. గ్రామం మొత్తంలో 14 వార్డులు, 8436 జనాభా ఉన్న వాడరేవులో మత్స్యకారులు, ఇతర సామాజిక వర్గాల వారు నివాసం ఉంటున్నారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే లైట్‌హౌస్ వద్ద ఉన్న శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేయడంతోపాటు సమాధులను నిర్మించుకుంటారు. అయితే వాడరేవులో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ అక్కడ చెత్తను వేయకుండా గ్రామంలోని వీధుల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను ట్రాక్టరు, చెత్త రిక్షాల ద్వారా శ్మశానవాటికలో డంపింగ్ చేస్తున్నారు. పంచాయతీ సెక్రటరీకి ఈ విషయం తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, కేవలం నాయకుల సేవలో తరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి దూరంగా ప్రభుత్వ స్థలాలను డంపింగ్ యార్డుగా వినియోగించుకోవాలని గతంలో పని చేసిన పాలవర్గం తీర్మానం చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రత్యేకాధికారుల పాలనలో అయినా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వాడరేవులో గ్రామంలో ఉన్న శ్మశానవాటికలో చెత్తను డంపింగ్ చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. చెత్త సమస్యను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. త్వరలో వేరే ప్రాంతానికి డంపింగ్ చేసేలా కృషి చేస్తున్నాం. సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యే, చీరాల ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు, నిధులు మంజూరు చేస్తే వేరే ప్రాంతంలో చెత్తను తరలించేందుకు కృషి చేస్తాం.

–కోట నాగయ్య, పంచాయతీ సెక్రటరీ

ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

సీడీపీవో సుచిత్ర



మాట్లాడుతున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల నిరంతర ఆరోగ్య సంరక్షణ బాధ్యతలలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్రే కీలకమని సీడీపీవో ఎం.సుచిత్ర పేర్కొన్నారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు, ఆయాలు యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించటంతోపాటు చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్య అందించాలన్నారు. పనివేళల్లో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి కేంద్రంలో మదర్స్ వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి పిల్లలు చేసే కార్యక్రమాలను గ్రూపు ద్వారా తల్లులకు తెలియజేయాలన్నారు. కేంద్రాలకు గుడ్లు, బాలామృతం, బాల సంజీవని, పాలు వంటి పదార్థాలు సకాలంలో రాకుంటే తమ దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కేంద్రాలలో నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ప్రథమ్ కోఆర్డినేటర్ త్రివేణి, సూపర్‌వైజర్‌లు సీహెచ్ హిమబిందు, టీ.రాధిక, ఎస్.సుజాత, విజయలక్ష్మి, మంజుల, నాగలక్ష్మి, అరుణ, అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరు మృతి.. ఐదుగురికి స్వల్ప గాయాలు



లారీనీ ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

సంతమాగులూరు(అద్దంకి): నిలిచి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఐదుగురికి గాయాలైన సంఘటన సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. తణుకు నుంచి నంద్యాల వైపు లోడ్‌తో వెళుతున్న లారీ పాత మాగులూరు వద్ద ఆగి ఉంది. ఈ క్రమంలో విజయవాడ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందున్న లారీని గమనించకుండా ఢీ కొట్టడంతో మూడో సీటులో కూర్చున్న అనంతపురం రూరల్ మండలానికి చెందిన హుస్సేన్(55) అక్కడిక్కడే మృతిచెందాడు. మరో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

రైలులో బెర్త్ లేక బస్సులో..

దూదేకుల హుస్సేన్ ఈ నెల 17వ తేదీన తన స్నేహితుడు అబ్దుల్ దౌలాతో పనిమీద విజయవాడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇద్దరూ రైలు ఎక్కడానికి మచిలీపట్నం రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఒకే బెర్త్ ఉండటంతో, దౌలా రైలు ఎక్కాడు. హుస్సేన్ బస్సులో అనంతరపురం బయలుదేరాడు.



మృతుడు హుస్సేన్

ఆ బస్సు సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామ సమీపంలోకి రాగానే ముందు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో సీటులో కూర్చుని ఉన్న హుస్సేన్ తల ముందు సీటుకు తగిలి, తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఆశాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పట్టాభి తెలిపారు.

డిగ్రీ పట్టా వెనుక తల్లిదండ్రుల త్యాగం

- ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి
- ఘనంగా వీవీఐటీ స్నాతకోత్సవం



కళాశాల టాపర్ బిందురేణుకకు బంగారు పతకం అందజేస్తున్న మధుమూర్తి

పెదకాకాని: ప్రతి ఒక్క విద్యార్థి డిగ్రీ పట్టా వెనుక తల్లిదండ్రుల త్యాగాలు ఎన్నో ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి, వీవీఐటీ విశ్వవిద్యాలయ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.ప్రొఫెసర్ మధుమూర్తి మాట్లాడుతూ డిగ్రీ అంటే కేవలం పట్టా మాత్రమే కాదు జ్ఞానాన్ని సంపాదించడం అన్నారు. స్టార్టప్ కంపెనీలను స్థాపించి ఉద్యోగాలు అందించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. వీవీఐటీ విశ్వవిద్యాలయ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు మాట్లాడుతూ 2007లో ప్రారంభమైన వీవీఐటీ కళాశాల అనతి కాలంలోనే అనేక విజయాలను సొంతం చేసుకొని 2025లో విశ్వవిద్యాలయంగా ఎదిగిందని చెప్పారు. వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి కళాశాల వార్షిక ప్రణాళికను, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. 2021-2025 విద్యా సంవత్సరానికి గాను అత్యుత్తమ ప్రతిభ కనబరచి కళాశాల టాపర్‌గా నిలచిన విద్యార్థిని పరుచూరి బిందు రేణుకకు వాసిరెడ్డి వెంకటాద్రి బంగారు పతకాన్ని ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె. మధుమూర్తి అందజేశారు. క్లాస్ ఆఫ్ 2025కు ఉత్తమ ప్రతిభ కనబరచిన 11 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలతోపాటు 1195 మంది పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా విద్యార్థులు వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వీవీఐటీ వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ ఎస్. బదరీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామాళ్లపల్లి శ్రీకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ. 2.5 లక్షల నగదు అపహరణ

అద్దంకి: బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసి తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి గుర్తు తెలియని యువకులు నగదు కాజేసిన ఘటన పట్టణంలోని గురువారం చోటుచేసుకుంది. బాధితుడు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి తన ఖాతా నుంచి రూ.2.5 లక్షల నగదును విత్‌డ్రా చేసి కవర్‌లో ఉంచి దాన్ని బైక్ ట్యాంకు బ్యాగ్‌లో పెట్టుకుని తీసుకెళుతున్నాడు. మార్గంమధ్యలో టీ తాగడానికి ఆగాడు. బండిపై నుంచి వెంకటరామిరెడ్డి దిగగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ కవర్లో ఉంచిన నగదు తీసుకుని ఉడాయించారు. ఈ విషయమై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోండి

వెల్దుర్తి:మండల పరిధిలోని శిరిగిరిపాడు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చేరేందుకు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. గురువారం పాఠశాలలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాఠశాలలో 3వ తరగతికి 60 సీట్లు, 4వ తరగతికి 20, 5వ తరగతికి 7, 6వ తరగతికి 3, 7వ తరగతికి 2, 8వ తరగతికి 8, 9వ తరగతికి 10 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు పాఠశాలకు దగ్గరలోని దుర్గి, కారంపూడి, మాచర్ల, బొల్లాపల్లి, రెంటచింతల, పిడుగురాళ్ల మండలాల లోని చెంచు, ఎరుకుల, యానాది సామాజిక వర్గాలకు చెందిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇరు కుటుంబాల ఘర్షణ

చిలకలూరిపేటటౌన్: ఆర్థికపరమైన వివాదాన్ని మనసులో పెట్టుకుని ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఘటన చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన ఆవుల దేవరాజు, శ్రీదేవి దంపతులు, అదే గ్రామానికి చెందిన ఎం.నాగరాజు, గోవిందమ్మ దంపతులు గురువారం గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పెదకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో ఇరు కుటుంబసభ్యుల మధ్య జరిగిన వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈమేరకు జరిగిన దాడిలో శ్రీదేవికి గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై మూడు వాహనాలు ఢీ



జాతీయ రహదారిపై ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

మార్టూరు: జాతీయ రహదారిపై ఒకదాని వెనుక మరొకటిగా వెళుతున్న మూడు వాహనాలు పరస్పరం ఢీకొన్న సంఘటన స్థానిక రాజుపాలెం, డేగరమూడి రెస్ట్ ఏరియా సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నాయక్, శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన పద్మనాభయ్య శెట్టి తన వాహనంలో చిలకలూరిపేట నుంచి ఒంగోలు వెళ్తున్నాడు. రెస్ట్ ఏరియా సమీపంలోకి వెళ్లగానే వాహనాన్ని వెనుక నుంచి గ్రావెల్ తరలించే టిప్పర్ వాహన డ్రైవర్ బలంగా ఢీ కొట్టి రహదారి మధ్యలో తన వాహనాన్ని నిలిపివేశాడు. అదే మార్గంలో విజయవాడ నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళుతున్న కంటైనర్ వాహనం హఠాత్తుగా అడ్డుగా వచ్చిన టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు మూడు వాహనాలు ధ్వంసం అయినప్పటికీ వాహనాల్లోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని రహదారికి అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఘనజీవామృతంతో నేల సారవంతం



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం అమలకుమారి

మాదల(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ విధానం పాటించే రైతులు పంటలను సాగు చేసే ముందుగా వారి పొలంలో ఘనజీవామృతం ఒక ఎకరాకు 500 కిలోలు చల్లితే భూమి ఆరోగ్యంగా ఉండి పంట దిగుబడి పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం ఏపీఎం కె.అమలకుమారి అన్నారు. మండలంలోని మాదల గ్రామంలో మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు నిర్వహిస్తున్న గోశాలను గురువారం సందర్శించారు. గోశాలలో 400 టన్నుల ఆవు పేడ, మూత్రంతో 300 టన్నుల ఘనజీవామృతం, పంచగవ్య తయారు చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటుగా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన కషాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతులకు కావాల్సిన ఇన్‌పుట్స్ గోశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. సత్తెనపల్లి ఎంటీ మధుబాబు, సౌజన్య పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎన్ సమస్యకు శాశ్వత పరిష్కారం

నరసరావుపేట సర్వేశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

యడ్లపాడు: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ల్యాండ్ పార్సిల్ నంబర్ (ఎల్‌పీఎన్)తో ఇబ్బందులు పడుతున్న రైతులు సబ్-డివిజన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట సర్వేశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. గురువారం యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, తహసీల్దార్ జెట్టి విజయశ్రీతో సమావేశమై జాయింట్ ఎల్‌పీఎం, సబ్-డివిజన్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కలిసి ఒకే జాయింట్ ఎల్‌పీఎన్‌తో 10 ఎకరాలకు మించి భూమి కలిగి ఉండటం వల్ల కొందరు అర్హత ఉన్నప్పటికీ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాల నగదును పొందలేకపోతున్నారని శ్రీనివాస్ తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లో పరిధిలో ఈ తరహావి మొత్తం 6,416 జాయింట్ ఎల్‌పీఎంలు ఉండగా, ఒక్క యడ్లపాడు మండలంలో 1872 జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ జాయింట్ ఎల్‌పీఎంలను సబ్-డివిజన్ చేస్తున్నట్లు శ్రీనివాస్ స్పష్టం చేశారు. రైతులు కేవలం రూ.50 రుసుంతో గ్రామ సచివాలయాల్లో వెంటనే సబ్-డివిజన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30లోపు సబ్-డివిజన్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. మండల సర్వేయర్ సురేంద్రతోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సింగయ్య కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంగళాయపాలెం గ్రామానికి చెందిన చీలి సింగయ్య (53) కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు గురువారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నియోజకవర్గం ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి కొలకలూరి కోటేశ్వరరావు తదితరులు సింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లల చదువులు, తదితర విషయాలను వాకబు చేశారు. కుటుంబానికి వైఎస్సార్ సీపీ కుటుంబం ప్రతి విషయంలో తోడుంటుందని తెలిపారు. పార్టీ తరఫున ఇప్పటికే రూ. 10 లక్షలను ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల అదృశ్యంపై ఫిర్యాదు



కనిపించకుండా పోయిన తోడికోడళ్లు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో నివసించే రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు కనిపించడం లేదంటూ ఓ వ్యక్తి గురువారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. కారు డ్రైవింగ్‌కు వెళ్లిన బెవర దుర్గారావు ఇంట్లో ఉన్న భార్యకు ఫోన్ చేశాడు. ఆమె గానీ కుటుంబ సభ్యులు గానీ లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వచ్చి చూడగా వారు కనిపించలేదు. తన భార్యతో పాటు తోడల్లుడి కుటుంబం కూడా కనిపించడం లేదని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. కనిపించకుండా పోయిన వారిలో దుర్గారావు భార్య సుధారాణి, కుమారుడు నవీన్ కుమార్, కుమార్తె యశ్వని, తోటికోడలు, మరో ఇద్దరు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కుమార్ కేసు నమోదు చేశారు.

వెంకట జయవర్ధన్ రెడ్డి అకాలమృతి బాధాకరం



వెంకట జయవర్ధన్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి

సత్తెనపల్లి: యువకుడు పాపసాని వెంకట జయవర్ధన్‌రెడ్డి అకాల మరణం బాధాకరమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి 16వ వార్డు వడ్డవల్లి ఏరియాకు చెందిన పాపసాని వెంకట జయవర్ధన్ రెడ్డి బుధవారం సొమ్మసిల్లి పడిపోయి గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం నిర్వహించిన అంతిమ యాత్రలో గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు, తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాల్సిన కుమారుడు అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. వెంకట జయవర్ధన్‌రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతికలగాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం వెంకట జయవర్ధన్‌రెడ్డి మృతి వార్త తెలియడంతో డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డితో పాటు మాజీమంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేష్‌రెడ్డి, యర్రం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, రోళ్ల మాధవిలు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర జరిగింది. ప్రత్యేక వాహనంపై వెంకట జయవర్ధన్‌రెడ్డి పార్థీవ దేహాన్ని ఏర్పాటు చేసి పట్టణంలో ప్రదర్శన చేశారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మృతుడి మిత్ర బృందం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జయవర్ధన్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం

పట్టణంలోని 16వ వార్డు వడవల్లి ఏరియాకు చెందిన యువకుడు పాపసాని వెంకట జయవర్ధన్‌రెడ్డి (32) బుధవారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో సొమ్మ సిల్లి పడిపోగా వైద్యశాలకు తరలించగా గుండెపోటుతో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. పాపసాని వెంకటజయవర్ధన్‌రెడ్డి మృతదేహానికి రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో గురువారం ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా పట్టణ ఎస్ఐ ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేశారు.